


## 6న అసెంబ్లీ ముట్టడికి తరలిరండి

ప్రజాశక్తి-కడప అర్బన్: సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో సర్పంచులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో నిధుల సమస్యల కారణంగా ప్రజాప్రతినిధులతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పంచాయతీరాజ్ వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని పేర్కొన్నారు. కేంద్ర నిధులను కూడా దారి మళ్లించారని ఆరోపించారు. ఎలాంటి నిధులను విడుదల చేయకపోగా తమ నిధులను పక్కదారి పట్టించడం తగదన్నారు. 15వ గ్రాంట్ కింద కొంత నిధులను కేటాయించినప్పటికీ అందుకు సంబంధించి నిబంధనలను పెట్టడం దారుణమన్నారు. ఈ క్రమంలో చేపట్టే చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



# కెపి ఉల్లి రైతు విలవిల

- భారీగా ధరలు పతనం
- దళారులు నిర్ణయించిందే ధర
- రూ.8 వేల నుంచి రూ.2,300లకు పడిపోయిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. అయితే కృష్ణాపురం (కెపి) ఉల్లి సాగు చేసిన రైతు పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉల్లి ధరలు మార్కెట్లో పరవాలేదు అనుకుంటే పండించిన పంటను అమ్ముకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కెపి ఉల్లి సాగు చేసిన రైతులు రూ.పది సంపాదించుకోవచ్చు అని ఆశించారు. పండించిన పంటను అమ్ముకునేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చులు చేయాల్సి వస్తోంది. విత్తనాలు కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వరకు వినియోగిస్తారు. నార్లుపెట్టి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. గతేడాది క్వింటా రూ.8 వేలు ఉన్న ధరలు క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.2 వేలకు పడిపోయాయి. రాయలసీమను వివిధ మార్గాల ద్వారా తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి పంటను విదేశీ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. స్థానికంగా అమ్మకం చేయాలంటే దళారులు నిర్ణయించిందే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలతో పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచింది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబాయ్, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉండేది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను నిషేధం విధించింది. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించకుండా అన్ని ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు ఇతర ప్రాంతాలలో గతంలో పది వేల ఎకరాలకు పైగా ఉల్లి పంట సాగయ్యేది. ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడం, ధరలు లేకపోవడంతో క్రమేపి తగ్గుతూ ఏడాది కేవలం 2 వేల ఎకరాలు మాత్రమే సాగైంది. రైతులు ఉల్లి పంటను ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేయడం ఆనవాయితీ. ప్రారంభంలో క్వింటా కెపి ఉల్లి ధర రూ.11 వేలతో ప్రారంభమై రూ.8000 వరకు తగ్గాయి. ప్రస్తుతం రూ.2300 మాత్రమే పలుకుతున్నాయి. గతంలో మార్కెట్ యార్డ్ ద్వారా అమ్మకాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ వారు కొనుగోలు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో రైతులు సంఘంగా ఏర్పడి మార్క్‌ఫెడ్ ద్వారా కెపి ఉల్లి కొనుగోలు చేయాలని నిరసనలు కూడా చేపట్టారు. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు ఎగుమతుల అవసరాలకు పండించే కెపి ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉన్నది. ప్రభుత్వం స్పందించి కెపి ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధం ఎత్తి వేయించి శాశ్వత కెపి ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

### అమ్మకం కష్టంగా మారుతోంది


ఉల్లి పంటను నూర్పిడి చేసిన తరువాత అమ్మకాలు చేపడదామంటే కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ధరలు చాలా అధ్వాన్నంగా ఉంటున్నాయి. కెపి ఉల్లి పంటలో ఎన్నో ఏళ్లుగా సాగు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించిన సందర్భంలో అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కెపి ఉల్లి కొనుగోలు చేయాలి.

- శివ చంద్రారెడ్డి, రైతు, నాగాయపల్లె.

### శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కెపి ఉల్లి మన ప్రాంతంలో మాత్రమే సాగయ్యే ప్రత్యేక రకానికి చెందినది. సాగుకు అధిక ఖర్చులు అవుతున్నాయి. అమ్మకం సమయంలో చాలా అవస్థలు పడాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ప్రభుత్వం శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగుకు ఆసక్తి ఉంటుంది. ధరలు నెల రోజులలోపే అమాంతంగా తగ్గిపోయాయి.

- మల్లికార్జునరెడ్డి, చల్లబసాయపల్లె, మైదుకూరు.



# ఒపిఎస్ కోసం మరో పోరుబాట : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

పాత పింఛన్ సాధన కోసం మరో పోరుబాటకు యుటిఎఫ్ సమాయత్తమైందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒపిఎస్ కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయక పోగా నాలుగేళ్ల తర్వాత జిపిఎస్ అనే మరో దుర్మార్గపూరితమైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాత, రాణి, ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, ఏజాస్ అహమ్మద్, శ్రీనివాసులు, చంద్ర ఓబుల్ రెడ్డి, సి.వి.రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, మస్తాన్ వల్లి, పెంచలయ్య, సుధాకర్, చెన్నయ్య,సుబ్బారావు, పార్థసారథి, వెంకటసుబ్బయ్య, శివ శంకర్ రెడ్డి, రాజా, గురు మోహన్, నాగన్న పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

ప్రభుత్వం అదిగో మెగా డిఎస్‌సి ఇదిగో మెగా డిఎస్‌సి అంటూ ఊరించి నాలుగున్నర ఏళ్ల తర్వాత నిరుద్యోగులు చెవిలో పువ్వులు పెట్టిన ఘనత ప్రభుత్వానికే దక్కిందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని విమర్శించారు. శనివారం స్థానిక పట్టణంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి ఊరిస్తూ కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికే మెగా డిఎస్‌సి కోసం డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా అనేక రూపాలలో ఆందోళనలు నిర్వహించి చివరకు విద్యాశాఖ మంత్రి ఇల్లు ముట్టడి, చలో సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడి, విజయవాడలో 36 గంటల పాటు నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. వందలాది మంది డివైఎఫ్ఐ నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది తప్ప మెగా డిఎస్‌సి ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకొని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకు రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండేళ్ల అప్రెంటేషన్ విధానాన్ని తీసుకురావడం ఏమిటి అని ప్రశ్నించారు. ఇది ఎప్పుడో రద్దు చేశారని తిరిగి అప్రెంటేషన్ విధానాన్ని తీసుకురావడం సరికాదన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టు భర్తీ అనడం నిరుద్యోగులను మోసం చేయడమేనని, నాలుగు సంవత్సరాల నుంచి పది లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సిని ప్రకటించాలని విమర్శించారు. లేకపోతే ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, బద్వేల్ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఓబుల్ రెడ్డి యు.బాల గురయ్య పాల్గొన్నారు.

## వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

డిఎస్‌సి అభ్యర్థులను నయా మోసం చేసిన ప్రభుత్వం అభ్యర్థులకు వయోపరిమితి 47 ఏళ్ల పెంచాలని, 25 వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండు డివైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా రెండేళ్లు అప్రెంటిష్ విధానాన్ని తీసుకోరావడం ఎమిటని ప్రశ్నించారు. ఇది ఎప్పుడో రద్దు చేశారని తిరిగి అప్రెంటిస్ విధానాన్ని తీసుకోరావడం సరికాదన్నారు. సమావేశంలో డిఎస్‌సి అభ్యర్థులు కుశీల్ కుమార్, విద్యాసాగర్, డివైఎఫ్ఐ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

## వైసిపిని భూస్థాపితం చేయాలి : మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలని కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి పేర్కొన్నారు. నగరంలోని ఏడవ డివిజన్, శంకరాపురంలో శనివారం ఆమె ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కరపత్రాలను స్థానికులకు అందించి, పథకాల లబ్ది వివరాలను వివరంగా వివరించారు. ఇంటి వద్ద ఉన్న వృద్ధుల వద్దకెళ్లి పింఛను వస్తుందా అంటూ వారి సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ పథకాన్ని తీసుకువచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని తెలిపారు. అధికారంలోకి రావాలని జగన్ పింఛన్ పెంపు చేస్తానని, అధికారంలోకి వచ్చి రకరకాల కారణాలు చూపి రేషన్ కార్డులు తొలగించి, పింఛన్లను కోత కోశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి పట్టం కడితే ఒకే ఇంటిలో అవ్వ తాతకు పింఛన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి, రాంప్రసాద్, హరి, బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైవీయూ ఇంజినీరింగ్ కళాశాల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. సివిల్, సిఎస్ఇ, ఇఇఇ, ఇసిఇ, ఎంఇ, ఎంఎంటి బ్రాంచీలలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 196 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. 81.66 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సివిల్‌లో 85.71 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 90.90 శాతం, ఇఇఇలో 74.41 శాతం, ఇసిఇలో 65.21 శాతం, ఎంఇలో 78.78 శాతం, ఎంఎంటిలో 100 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగాన్ని అభినందించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వైవీయూ కుల సచివులు ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ఆచార్యులు సి.నాగరాజు, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, డీన్ ఆచార్య కె.రమణయ్య పాల్గొన్నారు.

## అలీఖాన్, గౌస్‌పీర్‌లకు అభినందనలు

ప్రజాశక్తి - కడప : మైనారిటీ సంక్షేమ శాఖకు సంబంధించి ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల అమలు కార్యక్రమ రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులుగా వైఎస్ఆర్‌కు చెందిన ఎన్.ఎం.డి.ఖాలీక్ అలీఖాన్, జిల్లా సభ్యులుగా గౌస్‌పీర్ ఎంపిక పట్ల ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అభినందనలు తెలియజేశారు.నియామక ఉత్తర్వు లేఖను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పదవిని వచ్చేందుకు కృషి చేసిన ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి

## మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : డిసి

ప్రజాశక్తి-కాశినాయన

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా అన్నారు. శనివారం మండల కేంద్రమైన నరసాపురంలోని జడ్పి హైస్కూల్ ఆవరణంలో వెలుగు పథకం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ఎంతో అండగా ఉంటూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమానికి వైసిపి మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, ఎంపిపి పోలమ్మ, బద్వేల్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ హనుమంతురెడ్డి, నాయకులు ఆదిత్యారెడ్డి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎపిఎం రామాంజనేయులు, వెలుగు సిసిలు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

## సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పౌరవేదిక, ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయనకు శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం నాయకులు గురుమూర్తి, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను తక్షణం గుర్తించి పరిష్కరించేందుకు చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, షేక్ అన్వర్ బాష, జాతీయ బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రామసుబ్బయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ యాదవ్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జి.నాగార్జున, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్ సాహెబ్, కె.బి.రసూల్, షేక్ ఖాజాగౌస్, బలిజ సంఘం నాయకులు హనుమంతు, బాల నరసింహులు, బి.సి సంఘ నాయకులు కుంభగిరి రాజగోపాల్ పాల్గొన్నారు.

## వివేకానందుని స్ఫూర్తితో రాణించాలి

ప్రజాశక్తి-కలసపాడు

విద్యార్థులు వివేకానందుని స్ఫూర్తితో రాణించాలనిసెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి తెలిపారు. శనివారం పాఠశాలలో ఎఫ్‌సిఎన్ సంస్థ వ్యవస్థాపకులైన డాక్టర్ గీతా తామస్‌రెడ్డి పర్యవేక్షణలో కలసపాడు ప్రాజెక్టు ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలోని కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్‌రెడ్డి వివేకానందుని జీవితంపై పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ స్ఫూర్తి దాయకమైన స్వామి వివేకానంద జీవితం యువతరానికి ఎంతో ఆసక్తి కలిగించే విధంగా, అర్థమయ్యే సులభ సరళ పద్ధతిలో స్వామీజీ ప్రబోధాలతో కూడుకున్నవని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.




వివేకానందుని పుస్తకాలతో విద్యార్థులు

## పలు విభాగాల్లో వైవీయూ విసి తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సైన్స్ బ్లాక్‌లో బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగ తరగతి గదులకు వచ్చారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. సైన్స్ బ్లాక్‌లో పలు విభాగాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగాన్ని పరిశీలించి రికార్డులను చూసి అధికారులకు పలు సూచనలు చేశారు.

## నిరుద్యోగులను మోసగించిన జగన్ : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న హరిప్రసాద్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వదిలింది మెగా డిఎస్‌సి కాదని, నిరుద్యోగ దగా డిఎస్‌సి అని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ అన్నారు. శనివారం హరిటవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50,892 ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 6,100 ఉద్యోగాలకి నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ రానున్నడంతో నిరుద్యోగులను మరోమారు మోసం చేసే అందుకు జగన్ సిద్ధమయ్యారని విమర్శించారు. ఉద్యోగాలు, ఉపాధి లేక 1745 మంది రాష్ట్రంలో బలవన్మరణానికి పాల్పడ్డారని చెప్పారు. జగన్ సభ కోసం ఇంటర్ పరీక్షలనే వాయిదా వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజు, ఈశ్వరయ్య, ఖాసిం, అమీర్ పాల్గొన్నారు.

## కడప అసెంబ్లీకి పోటీ చేస్తా : రాము

ప్రజాశక్తి - కడప

కడప అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సామాజిక కార్యకర్త సమతం రాము అన్నారు. శనివారం బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సమావేశం ఏర్పాటు చేసి బలిజలు, ఇతరుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు.

## ప్రహరీని పడగొట్టడం దారుణం

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న ఆరిఫుల్లా

నగరంలోని యాఖున్ సాహెబ్ మసీదు బరెల్ గ్రౌండ్ ప్రహరీని మున్సిపల్ అధికారులు పడగొడ్డటం దారుణమని మాజీ డిప్యూటీ మేయర్ అరిఫుల్లా అన్నారు. శనివారం నగరంలోని వైవి స్ట్రీట్‌లోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో యాకూబ్ సాహెబ్ మసీదు బరెల్ గ్రౌండ్ ప్రహరీని పడగొట్టకూడదని ముస్లిం మైనార్టీలు ఎన్నో ఆందోళనలు చేపట్టారని తెలిపారు. శ్మశాన వాటిక గోడను పడగొట్టడంతో లోపలికి పందులు, గేదలు వెళుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రహరీ విషయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు పడగొట్టిన ప్రహరీని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముస్లిం మైనార్టీలంతా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎస్‌జెఐసి జాతీయ చైర్మన్ షా మహమ్మద్, అబ్దుల్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్

బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి ఆరవ వైఫా తేక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారిణి షేక్ హలీమా సాదియాను జెకె యూత్ ఆధ్వర్యంలో అభినందించారు. శనివారం జెకె యూత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులు ఖాదర్బాషా మాట్లాడుతూ మరిన్ని పథకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, సికిందర్, హుస్సేన్, జంషుద్దీన్ పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కడప

జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో శనివారం కడప నగరం అలంకాన్‌పల్లెలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేశ్ మాట్లాడుతూ యువత జీవితానికి సంబంధించి ఒక లక్ష్యాలని ఏర్పరచుకోవాలన్నారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయి గ్రేస్ మాట్లాడుతూ ఆధునిక విద్యావిధానం మానవులను సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మునిరత్నమ్మ, పాఠశాల సిబ్బంది, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెఎస్ఆర్ఎంకు అత్యుత్తమ అవార్డు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్, అల్ట్రాటెక్ సిమెంట్ ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఐసిఐ-అల్ట్రాటెక్ అవార్డ్స్-2023ను కెఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ప్రతిష్టాత్మక ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ బెస్ట్ స్టూడెంట్స్ చాప్టర్ అవార్డు లభించిందని కళాశాల ప్రదానాచార్యులు డాక్టర్ వి.ఎస్ ఎస్ మూర్తి తెలిపారు. శనివారం ఈ అవార్డును కె.ఎస్.ఆర్.ఎం ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి విజయవాడలో పివిపి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, ఐసిఐ ఎపి చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ వెంగళ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ గుర్తింపు కాంక్రీట్ టెక్నాలజీలో శ్రేష్ఠత, సృజనాత్మకత పట్ల చాప్టర్ యొక్క అదుతేమైన నిబద్ధతను తెలియ జేస్తుందని ఎండి పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం, విద్యార్థుల అంకితభావానికి గర్వపడుతోందని తెలిపారు. ఈ రంగానికి నిరంతర సహకారం కోసం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు. కాంక్రీట్ టెక్నాలజీలో భవిష్యత్ నాయకులను పెంపొందించడంలో కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఒక దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు.




అవార్డు అందుకుంటున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

## నిరుత్సాహం

ప్రజా'దృష్టి'

కేంద్ర బడ్జెట్ నిరుత్సాహపరిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 47.66 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ఎటువంటి శషబిషలకు తావు లేకుండానే దేశంలోని కార్పొరేట్లకు మేలు చేస్తూ బడ్జెట్‌ను వండివార్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల వేళ పేదలు, మధ్య తరగతి, రైతుల గురించి ఆలోచిస్తుందని ఆశించిన వారికి తీవ్ర నిరాశను కలిగించింది. సుమారు రెండు కోట్ల ప్రభుత్వ, మరో రెండు కోట్ల ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను నిర్లక్ష్యం చేసింది. వేతన జీవుల వేతన శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకుండా నిరుత్సాహపరిచింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మహిళలకు మేలు చేస్తున్నట్లు బడ్జెట్లో ప్రకటించింది. దేశంలోని 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది సభ్యులకు, ఆయుష్మాన్ భారత్‌లో ఆశాలు, అంగన్వాడీలకు స్థానం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ, 2024 నడుస్తున్నప్పటికీ రైతుల ఆదా యాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ నీరోడుతోంది. ఇది చాలదన్నట్లు రైతుల ఆదాయాన్ని అధికం చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా మారిందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర విభజన హామీలైన కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీని నిర్లక్ష్యం చేసింది. ప్రతి ఏటా రాష్ట్రంలోని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అడిగినప్పుడు పదేళ్లలో అమలు చేయాల్సిన నిర్ణయాలని, ఇంకా సమయం ఉందని దాటవేయడం తెలిసిందే. రాష్ట్రం విడిపోయి నేటితో పదేళ్లు నిండిన నేపథ్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులను విడుదలను నిలిపేసింది. కడప-బెంగళూరు రైల్వేలైన్ ఏర్పాటు కలగా మారింది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కేంద్ర, రాష్ట్రాల సంయుక్త భాగస్వామ్యంతో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతంలో రాష్ట్రంలోని వైఎస్ జగన్ సర్కారు ఆయన ఆశయాన్ని అడియాశలు చేసేదిశగా పయనిస్తోంది. కడప నుంచి బెంగళూరుకు రైల్వేలైన్ ఏర్పడితే సాఫ్ట్ వేర్ ఉద్యోగుల దగ్గర నుంచి రైతుల ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తుల సరఫరా చేయడం సులభంగా మారనుంది. ఫలితంగా వెనుకబడిన ప్రాంతంలోని కడప జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి సరుకుల రవాణా దగ్గర నుంచి మానవ వనరుల రాకపోకలు పెరగడం ద్వారా పేదలకు మేలు కలిగే అవకాశం ఉండేది. ఇటువంటి ప్రజల సౌకర్యాలను కాదని, ముద్దనూరు మీదుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు మొగ్గు చూపించడం విస్మయాన్ని కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం ఆందోళనకరం. ఇది చాలద న్నట్లు కేంద్రం మొండి చేయి చూపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేప థ్యంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కడప, రాజంపేట ఎంపీలు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. దీంతోపాటు ఓబులారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్‌ను సరుకుల రవాణాకు పరిమితం చేయడంపై ఎటువంటి స్పందన లేకపోవడం, జిల్లా నుంచి ప్రొద్దు టూరు-కంభం సహా పలు రైల్వేలైన్లకు కేటాయింపులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏదేమైనా జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవహరించలేని ఎంపీల వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

## కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎంపీ

**ప్రజాశక్తి - చక్రాయపేట**


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

చక్రాయపేటలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో పాడా నిధులతో నూతనంగా నిర్మాణం పూర్తయిన కల్యాణ మండపం శనివారం కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి, దేవస్థాన ఛైర్మన్ మోపురి రామాం జనేయులురెడ్డి అడ్వకేట్ ప్రారంభించారు. అనంతరం దేవస్థానం ఛైర్మన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన చక్రాయపేట చాలా వెనుక బడిన ప్రాంతమన్నారు. మధ్య తరగతి వాళ్ల శుభకార్యాలు చేసుకునేందుకు అనుగుణగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ కర్నాటి హరి నాథరెడ్డి, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు శ్రీరామ్ మూర్తి, రంగారెడ్డి, కె.రామచంద్రారెడ్డి, చలపతి నాగ మల్లయ్య, ఇందుకూరు శ్రీనివాసులు, ఈశ్వరయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

## పశు బీమా చేయించాలి : డిడి శ్రీనివాసులు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పశువులు, గొర్రెలు, మేకలకు పశుబీమా చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జమ్మలమడుగు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు వాటి యజమానులకు సూచించారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో శనివారం ముద్దనూరు పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెల కాపరులు బీమా చేసుకోవాలన్నారు. మూర్రా జాతి గేదెలు, జెర్సీ, హెచ్.యఫ్ ఆవులు, ఒంగోలు జాతి ఆవులకు రూ.30 వేలు వస్తుందన్నారు. రైతులు మూడేళ్లకు రూ.384 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. నాటు ఆవులు, గేదెలకు రూ.15వేలు, మూడు సంవత్సరాలకు రూ.192 ప్రీమియం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు రూ.6వేలు. సంవత్సరానికి రైతు వాటా రూ.36 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పాడి రైతులు, పశు పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజశేఖర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## దెబ్బతిన్న వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు మున్సిపాటిటీ పరిధి పోరుమామిళ్ల రోడ్డులోని కెసి కెనాల్ వంతెనపై ఏర్పడిన రంధ్రాలకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా రైతు సంఘం నాయకులు ఎవి రమణ కోరారు. శనివారం ప్రజల పిలుపు సమస్య పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆయన దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు. ద్విచక్ర వాహన దారులు, ప్రజలు ఈ దారిన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్అండ్‌బి అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టకపోగా ప్రమాద సూచిక బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ మార్గాన ప్రయాణించే మున్సిపల్ అధి కారులు, ప్రజాప్రతినిధులకు ఈ సమస్య కనిపించకపోవడం చాలా అన్యా యమన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని సమస్య ఆందోళన చేస్తామని రమణ హెచ్చరించారు. కార్యక్రమంలో కడియం శ్రీనివాసులు, భూమిరెడ్డి వెంకట రమణ, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీని వాసులు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పది పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టు ప్రకారం ప్రణాళిక సిద్ధం చేసుకుని చదువుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే విజయం సాధిం చవచ్చన్నారు. సెల్‌ఫోన్లకు, టివికి దూరంగా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా చదివితే అత్యుత్తమ గ్రేడ్ సాధిస్తారన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ వహించి చదివించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని పులివెందుల ట్రాఫిక్ సిఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 35వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నారాయణ జూనియర్ కాలేజీలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. బండికి తగిన పత్రాలను ఉంచుకోవాలన్నారు. కారు, పెద్ద వాహనాలు నడిపేవారు కూడా సీట్ బెల్టును ధరించి వాహనం నడపాలని సూచించారు. పత్రాలు కూడా ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌లో నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. ట్రాఫిక్ సంబంధించి పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు.

## నేడు వేంపల్లెకు ఎంపీ రాక

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె దళితవాడకు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం విచ్చేస్తున్నట్లు ఎంపిపి లక్ష్మి గాయత్రి తెలిపారు. గ్రామం లోని టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొన్నాలని ఎంపిపి కోరారు. రామిరెడ్డిపల్లిలో కూడా కొన్ని కుటుంబాలు చేరుతున్నట్లు నాయకులు తెలిపారు.

## సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీలో శనివారం సచివాలయాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్ర మంలో జడ్పిటిసి రామ గోవిందరెడ్డి, ఎంపిపి వీరనారాయణరెడ్డి, ఎంపి టిసి ఎల్లటూరి ఈశ్వర్‌రెడ్డి, స్థలదాతలు పోచంరెడ్డి సుబ్బిరెడ్డి, నాయకులు ఎల్ల టూరు శివారెడ్డి, ఎత్తపు సుబ్బారెడ్డి, సోమిరెడ్డిపల్లి సహారా సంఘ పరపతి ఛైర్మన్ సుబ్బారెడ్డి, నేలటూరు వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, ఉమాపతి పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చని వైసిపి ప్రభుత్వం

**ప్రజాశక్తి - వేంపల్లె**

గత ఎన్నికల్లో చెప్పిన హామీలను వైసిపి ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమ్‌అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హామీలు నేరవేర్చని వైసిపిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ఎన్నికల ప్రచారంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి, మరిచారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిసి సిద్ధమా అని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో ఆమ్‌అద్మీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ రాజగ్, మండల సభ్యులు షఫీ, ఖదీర్ సలీమ్ అహమద్ పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాల రోడ్డులో చోరీ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. పట్టణంలోని మాస్టర్స్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సంజీవ దైవకార్యం నిమిత్తం కటుంబ సభ్యులతో ఆళ్లగడ్డకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని విషయాన్ని గ్రహించిన దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాలోని రెండు తులాల బంగారు, దాదాపు రూ.40వేలు నగదు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. శనివారం ఉదయం ఇంటి ముఖద్వారం తెరిచి ఉంచిన విషయాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు సంజీవకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. హుటాహుటిన ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అదనపు సమాచారం కోసం సిఐని కలువగా శనివారం సాయంత్రం వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

# బుడ్డ శనగ రైతుల్లో ఆందోళన

### గణనీయంగా తగ్గిన దిగుబడులు - ప్రారంభమైన శనగ కోతలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండల వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన బుడ్డ శనగ రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట కోతకు సిద్ధమైంది. గత ఏడాది అక్టోబర్ నెలలో కురిసిన అరకొర వర్షానికి రైతులు బుడ్డ శనగ సాగు చేప ట్టారు. మండల వ్యాప్తంగా దాదాపు 3,400 ఎకరాల్లో సాగు చేసినట్లు అది కారులు ఇ క్రాప్ ద్వారా పంట నమోదు చేశారు. తీవ్ర వర్షాభావం కారణంగా భూమిలో తేమ శాతం తక్కువ కావడంతో పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు.

**గణనీయంగా తగ్గిన దిగుబడులు**

మండల వ్యాప్తంగా బుడ్డ శనగ పంట దిగుబడి గణనీయంగా తగ్గిం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎకరాకు ఏడు నుంచి తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. అయితే ఈ ఏడాది రెండు నుంచి మూడు క్వింటాళ్లకు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. తగ్గిన దిగుబడులతోపాటు కూలీల ఖర్చు సైతం పెరిగింది. దీంతో కొంత మంది రైతులు ఆధునిక యంత్రాల సాయంతో పంటలను నూర్పిడి చేస్తు


కోతకు సిద్ధంగా ఉన్న బుడ్డ శనగ పంట

న్నారు. ఈ దిగుబడులతో పెట్టుబడులు సైతం రాకపోవడంతో నష్టాలు చవి చూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పం దించి తమకు పరిహారం అందించాలని బుడ్డ శనగ రైతులు కోరుతున్నారు.

# 'మెగా డిఎస్‌సి పేరుతో వంచించడమే'



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వదిలింది మెగా డిఎస్‌సి కాదు.. దగా డిఎస్‌సి అని జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 50,892 ఖాళీలుంటే, 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడం కాదా అని ప్రశ్నించారు. డిఎస్‌సి పేరుతో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్ ఈ నాలుగన్నరేళ్ల జగన్ చేసింది ఏం లేదన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లేలా బొత్సా కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా జగన్ మార్చారన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడిన దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండటం జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీను, నరసింహులు యాదవ్, సూర్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**టిడిపిలో 30 కుటుంబాలు చేరిక**

జమ్మలమడుగు 6వ వార్డు నాగలకట్టలోని బుడగ జంగం కాలనీలో శనివారం 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి భూపేష్‌రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నల్లప్ప, రాజశేఖర్, వెంకట రాముడు, గంపయ్య, శంకరయ్య, రాముడు, నారాయణ, రమేష్, జాను, బాల రంగయ్య, శివయ్య, శీనప్ప, గంగరాజు, సంజీవ, శ్రీరాములు, ప్రదీప్, మహేంద్ర, విజయ్, నాగలక్ష్మమ్మ, నాగమ్మ, నల్లమ్మ, అంజనమ్మ, సుంకన్న, రాము, గంగన్న, ప్రసాద్, నరసింహ, రంగమ్మ, వరాలమ్మ, పద్మావతి కుటుంబాల వారున్నారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానన్నారు. పార్టీలో చేరిన వారు సైనికుల్లా పనిచేసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వేయించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు.

**త్రోబాల్ పోటీలో కడప జిల్లా ఛాంపియన్**

త్రోబాల్ పోటీలో కడప జిల్లా పురుషుల జట్టు ఛాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉందని జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఛైర్మన్ సి.భూపేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో ఆయన వారిని అభినందించారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మవరం మండలం బత్తలపల్లిలో జరిగిన అంతర్ జిల్లా పురుషుల, మహిళల త్రోబాల్ పోటీల్లో కడప జిల్లా పురుషుల జట్టు ఫైనల్‌లో కృష్ణా జిల్లా జట్టును ఓడించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. త్రోబాల్ పోటీలు ఎక్కడ జరిగినా మన జిల్లా జట్టు విజయం సాధిస్తుందన్నారు. భవిష్యత్తులో ఇలాగే కొనసాగించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. క్రీడలు మానసిక ఆనందాన్నిస్తాయన్నారు. కార్యక్రమంలో త్రోబాల్ అసోసియేషన్ నుంచి సంయుక్త కార్యదర్శి ఎర్రన్న పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వదిలింది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని టిడిపి సింహాద్రిపురం మండల కన్వీనర్ మారెడ్డి జోగిరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 50,892 ఖాళీలుంటే, 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడమే అన్నారు. ప్రసాద్‌రెడ్డి, గడ్డం అమర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యార్థులకు జగన్ మామా కాదని, సైకో మామా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# విద్యాసాగర్ ఆస్పత్రిలో రోబోటిక్ టెక్నాలజీ వైద్యం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రాయలసీమలో ప్రప్రథమంగా అత్యాధునిక ప్రపంచస్థాయి 'రోబోటిక్ టెక్నాలజీ'ని మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల నిమిత్తం విద్యాసాగర్ ఆస్పత్రిలో ప్రారంభించామని డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమెరికాకు చెందిన స్మిత్ అండ్ నెఫ్యూ కంపెనీకి చెందిన సిఒఆర్ఐ రోబోటిక్ సిస్టిమ్‌ను కొన్ని రోజులుగా ఉపయోగించి సంతృప్తికరమైన సత్ఫలితాలను చూశామన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్నవారు తమ సంతృప్తిని, సంతోషాన్ని పాత్రికేయ మిత్రులతో పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇసిఒఆర్ఐ రోబోటిక్ ద్వారా మోకాలు మార్పిడి (టోటల్ నీ రీప్లేస్మెంట్), పాక్షిక మోకాలు మార్పిడి (పార్షియల్ నీ రీప్లేస్మెంట్ ), తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స (టోటల్ హిప్ రీప్లేస్మెంట్), రివిషన్ నీ రీప్లేస్మెంట్‌లు సిటి రేడియేషన్ అవసరం లేకుండా 'రియల్ ఇంటలిజెన్స్ హ్యాండ్ హెల్డ్ రోబోటిక్ ఆర్మ్' ఉపయోగించి శస్త్రచికిత్సలు చేయగలమని విద్యాసాగర్‌రెడ్డి వివరించారు. వైద్యుడి శస్త్రచికిత్స నైపుణ్యంతోపాటు అత్యాధునిక కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను వాడడంలో ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. 3,4 సంవత్సరాలు దేశ, విదేశాల్లో రోబోటిక్ టెక్నాలజీపై గడించిన విశేష అనుభవం, రోబోటిక్ టెక్నాలజీని డిజైన్ చేసిన బృందంతో చర్చల తర్వాత ఈ టెక్నాలజీని తీసుకొచ్చామని పేర్కొన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా పేషెంట్ మోకాలు, ఎముకల 3డి ఇమేజస్‌ని శస్త్రచికిత్సలో భాగంగా తీసుకోవడం ద్వారా అరిగిన శాతాన్ని, ప్రాంతాన్ని సూక్ష్మస్థాయిలో గుర్తించి, అవసరమైన మేరకే తక్కువ కోత ద్వారా తక్కువ బోన్ లాస్, తక్కువ టిష్యూ లాస్‌తో సక్రమమైన ఇంప్లాంట్ అమరికతో మోకాలుకు అధిక స్థిరత్వాన్ని చేకూర్చవచ్చని


మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

తెలిపారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా వంద శాతం ఖచ్చితత్వం, త్వరితగతిన రికవరీ, తక్కువ నొప్పి, దీర్ఘకాలిక మన్నిక, సాధారణ మోకాలు అనే భావన, సునాయాసమైన మోకాలు కదలికలు, సత్ఫలితాలు వంటి అనేక లాభాలను వివరించారు. విద్యాసాగర్ హాస్పిటల్ 15ఏళ్లుగా కడప జిల్లా, పరిసర జిల్లా వాసులకు వేలాది మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. విద్యాసాగర్ హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్యులు 5,800లకుపైగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన అనుభవం, ఇంపోర్టెడ్ మోకీలు పరికరాలు, లామినార్ ఎయిర్ ఫ్లో థియేటర్స్, అత్యాధునిక సదుపాయాలతో 50 పడకల ఆర్థోపెడిక్ హాస్పిటల్ దీనికి తోడు అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని జతపరిచామన్నారు. తద్వారా 100 శాతం మెరుగైన ఫలితాలను పొందగలరని వివరించారు. సమావేశంలో డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను చూసైనా కనికరించండి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)**

అమృత్‌నగర్‌లో శిథిలావస్థలో ఉన్న బేస్ మట్టాలు, రూఫ్ లెవెల్, స్లాబులనైనా చూసి తమపై కనికరించాలని లబ్ధిదారులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అమృత్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు శనివారానాకి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సంద ర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో పేదలకు స్థలాలిచ్చి మౌలిక వసతులు కల్పించకుండా వదిలేశారన్నారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్తు లేక లబ్ధిదారుల నిర్మించుకున్న నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారన్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక లబ్ధిదారులు రోడ్డున పడ్డారన్నారు. పది రోజులుగా ధర్నా నిర్వహిస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి తాళాలు వేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. ధర్నాలో లత, పద్మావతి, సువాసిని, హసీనా, వెంకటేశ్వర్లు, సాబీర్ పాల్గొన్నారు.

## సిఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

సిఎం జగన్‌కు మద్దతుగా నిలుద్దాం, రాష్ట్రం సుభిక్షం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాయని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు బొగ్గుడిపల్లె, పోలేపల్లి గ్రామంలో మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ రంగనాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వైస్ ఛైర్మన్ హఫీజ్, కమిషనర్ రమణారెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, డేనిల్ బాబు, నాగరాజు, రాజేష్ నాయుడు, రవి, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. శనివారం వేంపల్లెలోని స్వామి వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో వివేకానందుని జీవితంపై వ్యాస రచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీయన్ మాధవరావు, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, నాగలక్ష్మి దేవి, ఫిజికల్ డైరెక్టర్ తేజా పాల్గొన్నారు.

## జొన్న పంటను పరిశీలించిన అధికారులు

**దువ్వూరు :** మండలంలోని జొన్నసాగు చేసిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయుటకు డిఎం సివిల్ సప్లయ్ అర్జున్‌రావు, టెక్నికల్ అధికారి సాయి సాహితి జొన్న సాగులో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జున్‌రావు మాట్లాడుతూ తెల్లజొన్నలను ప్రభుత్వం మద్దతు ధరతో క్వింటా రూ.3180తో కొనుగోలు చేస్తుందన్నారు.

## ఉద్యాన పంటల సాగుపై అవగాహన

**చాపాడు :** మైదుకూరు మండల పరిధిలోని సుంకులవారిపల్లి గ్రామంలో వనిపెంట కెవికె శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఆర్‌హెచ్‌డబ్ల్యు ఇపి విద్యార్థులచే రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్.గోపాల్ మాట్లాడుతూ ఉద్యాన పంటలో సాగు చేయడం వలన దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చు అన్నారు. కెవికె సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. బాలకృష్ణ, ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రామయ్య, రామకృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ దీప్తి, డాక్టర్ కిరణ్, డాక్టర్ దినేష్, సుంకుల వారిపల్లి ఎంపిటిసి దశరథ రామిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ నాగేంద్ర పాల్గొన్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

రామిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డికి చెందిన **G0559559** అనే నెంబర్ గల పాస్‌పోర్టు కడప 7రోడ్ల కూడలి దగ్గర దారపోయినది. సదరు నెంబర్‌గల పాస్ పోర్టు దొరికినచో క్రింది అడ్రసుకు చేర్చగలరు.

**అడ్రస్ : రామిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి,**
**తండ్రి నరసింహారెడ్డి, డోర్‌నెం.4/74.**
**ఎగువపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం,**
**వైఎస్ఆర్ కడప జిల్లా. సెల్ : 7032186099.**

## ప్రొద్దుటూరు టిడిపి అభ్యర్థిని నేనే

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని తానేనంటూ జిల్లా టిడిపి అధ్యక్షులు ఎం.లింగారెడ్డి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా, సీనియర్ నేతగా పార్టీకి ఎంతో కృషి చేసిన తనకు తప్ప టికెట్ అడిగే అర్హత, పొందే అర్హత ఎవరికీ లేదన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ తన నివాసంలో శనివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ప్రొద్దు టూరు టిడిపి అభ్యర్థి తానేనం టూ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పోస్టర్లు వేయడం సరైంది కాదన్నారు. ఎవరికి వారు పోస్టర్లు వేసుకుంటూ పోతుంటే ఎలా అన్నారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ రాహిత్యం అవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఇంకా పార్టీ టికెట్ కన్ఫర్మ్ చేయలేదన్నారు. కరపత్రాలు కూడా ఆయన వ్యక్తిగతంగా వేసుకున్నవేనని లింగారెడ్డి తెలిపారు. బహునాయకత్వం ఉన్న ప్రొద్దుటూరులో ఇలా పోస్టర్లు వేయడం వల్ల ప్రజలు, కార్యకార్తలు అయోమయానికి గురయ్యే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో లాయర్ గుర్రప్ప, సిద్దయ్య, సుబ్బరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి

## పేదల అభివృద్ధే టిడిపి ధ్యేయం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

పట్టణ పరిధిలోని వినాయక్ నగర్‌లో శనివారం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ సతీమణి మౌనిక, అక్క హరిత బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. వారు ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా తన భర్తను ఎమ్మెల్యేగా గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల :** ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత మొదలైందని, వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 12వ కౌన్సిల్ వార్డులో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయ కులు చదిపిరాళ్ల జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక పులివెందుల రోడ్డులో టిడిపి నాయకులు, అభిమానుల మధ్య టిడిపి నేత డాక్టర్ డివి సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. డివి సుబ్బారెడ్డి మెడికల్ స్టోరు వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తనపై అభిమానం చూపిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మాజీ దేవ స్థానం ఛైర్మన్ జయచంద్రారెడ్డి, మాజీ గండి ఛైర్మన్ ఎస్‌వి రమణ, ఆర్‌వి రమేష్, పిపి చెంద్రాయుడు, యుగంధర్, కృష్ణారెడ్డి, పూర్ణాచంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి, డాక్టర్ హరీష్, మల్లంగి గోపాల్‌రెడ్డి, పాపిరెడ్డితోపాటు నాయకులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు కష్టం తెలిసేలా పెంచాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

విద్యార్థులకు ఏ కష్టం తెలియకుండా పెంచామని తల్లిదండ్రులు గొప్పలు చెప్పకుండా, కష్టమేంటో తెలిసేలా, సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ పెంచే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షులు శ్రీమత్ అనుపమానందజీ మహారాజ్ అన్నారు. స్థానిక స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల 23వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుని జీవితం వ్యక్తి పరిపూర్ణత్వానికి గొప్ప ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ డైరెక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎంఇఒ జాఫర్ సాదిక్, పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత

**చక్రాయపేట :** వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడతలో మంజూరైన రూ.3,09,38,850చెక్కును కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం చక్రాయపేటలో ఏర్పాటుచేసిన డ్వాక్రా సంఘం మహిళల సమావేశంలో ఎపిఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల సమైక్య అధ్యక్షురాలు నాగమణి, కోశాధికారి విజయలక్ష్మికి అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీ, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, చక్రాయపేట మండలం ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 473 డ్వాక్రాసంఘాల మహిళలకు 4643 మంది మహిళలకు వైయస్సార్ ఆసరా కింద మంజూరైన నిధులను వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్డిఎ ఆనంద నాయక్, ఎంపిపి మాధవి బాలకృష్ణ, ఎంపిడిఒ శివారెడ్డి, దేవస్థాన ఛైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి, ఎపి టూరిజం మాజీ డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపిపి రుక్మాంగదరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఎంపీటీసీలు ఇందుకూరు లీలావతి, బెల్లం వర్ధన్, శాంతమ్మ, సర్పంచులు అర్షద్ ఆయుబ్ బాషా, భోగాదమ్మ, నరసింహులు, వెలుగు సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలన

**పులివెందుల రూరల్ :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వేస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం వైయస్ మనోహర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ రమణారెడ్డి, గంగాధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారులతో వారు మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్నపల్లి కిషోర్, కో ఆప్షన్ చంద్రమౌళి, అసిస్టెంట్ ఇంజినీర్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఫర్నీచర్ కొరత.. కుర్చీలో ప్రింటర్

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఫర్నీచర్ కొరతతో ఉద్యోగులు అవస్తలు పడుతున్నారు. సరైన పర్నీచర్ లేక ప్రింటర్‌ను కుర్చీలో పెట్టు కొని పని చేస్తున్న దశ్యం శని వారం నగర పంచాయతీ కార్యాలయంలో దర్శనమిచ్చింది. నగర పంచాయతీ కార్యాల యంలో పర్నీచర్ కొరత కారణం గా సచివాలయాలకు కేటా యించిన పర్నీచర్ విని యోగిస్తున్నట్లు సమాచారం. రూ.కోటి 30 లక్షలు వెచ్చించి నూతన నగర పంచాయతీ కార్యాలయం నిర్మించినప్పటికీ కనీస సౌకర్యాలకు అవసరమయ్యే వస్తువులు కొనుగోలు చేయకపోవడం గమనార్హం. ఎర్రగుంట్ల నగర పంచాయతీకి వచ్చే రాబడి అభివృద్ధికే సరిపోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున అధికారులు పొదుపు చేస్తూ ఉన్నవాటితో సర్దుకుంటున్నారులే అంటూ విషయం తెలిసిన నగరవాసులు వ్యంగంగా చర్చించుకుంటున్నారు.


టేబుల్ లేకపోవడంతో కుర్చీలో పెట్టిన ప్రింటర్

Union Bank of India (A Government of India Undertaking)
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వేంపల్లి శాఖ, వేంపల్లి (గ్రా& పం.), మార్కెట్ రోడ్, వైఎస్ఆర్ కడప జిల్లా-516329, సంప్రదించు నం.: 9321714091.

**తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలం కొరకు ప్రకటన**

ఇందుమూలంగా దిగువ పేర్కొన్న వ్యక్తులకు తెలియజేయబడుచున్నది ఏమనగా, రుణ ఖాతాలోని బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలంచెందియున్నారు. వారికి నోటీసులు రిజిస్టర్డు పోస్టు ద్వారా పంపినప్పటికీ అవి బట్వాడా కాకుండా బ్యాంకుకు వెనుదిరిగినవి. అందుకుగాను బకాయి మొత్తాలు మరియు ఇతర చార్జీలును చెల్లించి **21.02.2024**న లేదా ముందుగా తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్‌ను విడిపించుకోగలరని కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, రుణగ్రహీత పూర్తి బాధ్యత పైననే, తదుపరి నోటీసు ఇవ్వకుండానే **22.02.2024**న లేదా ఆ తరువాత ఏదేని ఇతర సౌలభ్యమగు తేదీన **సా॥ 4.00గం.లకు** బ్యాంకు ఆవరణలో బ్యాంకు వారి సరైన నిర్ణయంమేరకు విక్రయించబడుతుంది.

| క్ర.సం. | రుణం తేది | రుణం నంబరు | రుణగ్రహీత పేరు & చిరునామా |
|---|---|---|---|
| 1 | 19.01.2021 | 140930100195828 | శ్రీమతి కోనేటి లక్ష్మి శ్రీదేవి, భర్త కె. ఈశ్వరయ్య, ఇ.నం.13-2567, గాజులపేట, వేంపల్లి, కడప జిల్లా-516329. |

**తేది: 02.02.2024** **బ్రాంచి మేనేజర్**